క్లుప్తంగా

దళితులకు రెండెకరాల భూమి కేటాయించాలి


తహసీల్దారుకు విన్నవిస్తున్న నాయకులు

పీలేరు: అర్హులైన దళితులకు రెండెకరాల భూమిని కేటాయించాలని మాల మహానాడు ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ అన్నారు. తహసీల్దారు భీమేశ్వరరావును శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దొడ్డిపల్లె గ్రామంలోని సర్వే నెంబరు 470/1లో 28 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. గ్రామంలో అర్హులైన దళితులకు ఆ వ్యవసాయ భూమి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామాంజులు, వెంకటరమణ, రమేష్, లోకనాథం, రామకృష్ణ, సురేంద్ర, శివ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు

కలికిరి: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్, 5వ తరగతి, 6, 7, 8, 9వ తరగతులలో బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా కన్వీనర్ ప్రధాచార్యులు వై.సోమశేఖర్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌కు ఏప్రిల్ 20న, 5వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 27న, బ్యాక్‌లాగ్ సీట్లకు 28న ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ నెల 15 నుంచి పాఠశాల వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ నమోదుకు మార్చి 15న ఆఖరి గడువు అన్నారు. మరిన్ని వివరాలకు 9000715637, 8790092069, 7989445396 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.రమా

పీలేరు: రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమా అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్‌లలో 751 వినతులు వచ్చినట్లు తెలిపారు. 204 అర్జీలు పరిష్కారం అయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. భూముల రీసర్వే సమస్యలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వరరావు, డీటీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బందోబస్తు మధ్య పనులు


భూమి పూజ చేస్తున్న కమిషనర్ పల్లవి

బి.కొత్తకోట: స్థానిక జ్యోతి చౌక్‌లో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు కమిషనర్ పల్లవి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఇక్కడ మరుగుదొడ్లు నిర్మించడానికి నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టగా ప్రైవేట్ వ్యక్తులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయం మదనపల్లె సబ్ కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన సీరియస్ అయ్యారు. పోలీసు బందోబస్తు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ పోలీసు బందోబస్తుతో వచ్చి పనులు చేపట్టేందుకు భూమి పూజ చేశారు. మేనేజర్ బి.రమాదేవి, వీఆర్‌ఓలు, పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ


అవగాహనా ర్యాలీలో అటవీ అధికారులు

తంబళ్లపల్లె: ప్రజల సహకారంతోనే అడవులను సంరక్షించడం సాధ్యమవుతుందని ఎఫ్ఎస్ఓ రెడ్డి వరప్రసాద్, ఎఫ్‌బిఓ రామ్‌రాజ్ తెలిపారు. మండల కేంద్రంలో అడవులకు నిప్పుపెడితే కలిగే అనర్థాలపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రామ్‌రాజ్ మాట్లాడుతూ అడవులకు నిప్పు పెడితే జీవన వైవిధ్యం దెబ్బతిని మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డప్పరెడ్డి, ఫోర్డు సంస్థ నరసింహులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

కురబలకోట: మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద శుక్రవారం రాత్రి కారు ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ధర్మపురికి చెందిన సతీష్‌కుమార్ (28) మోటార్ సైకిల్‌పై వెళుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. గాయాలైన సతీష్‌ను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

లైనింగ్ సరే..వంతెనలు నిర్మించరా!

పులికల్లు గ్రామం నుంచి మొదలయ్యే హంద్రీ–నీవా పుంగనూరు ఉపకాలువ (పీబీసీ)తో తమ పొలాలకు వెళ్లే దారులు తెగిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పీబీసీలో కృష్ణా జలాలు ప్రవహించినా, లేకున్నా..కాల్వకు ఒక వైపు ఉన్న రైతులు తమ పొలాలకు వెళ్లి వ్యవసాయం చేసుకోవాలన్నా, ప్రజలు దైనందిన కార్యక్రమాలకు, వ్యాపార, వ్యవసాయోత్పత్తులు తరలించాలన్నా రాకపోకలు సుగమం చేయాల్సిన అవసరం ఉంది.

- పీబీసీకి కాంక్రీట్ లైనింగ్ పనులు
- పొలాలకు తెగిన రాకపోకలు
- పనులు చేపట్టాలని రైతుల డిమాండ్

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లు గ్రామం నుంచి మొదలయ్యే హంద్రీ–నీవా పుంగనూరు ఉప కాలువ (పీబీసీ) కింద రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంది. అప్పటి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చొరవతో పనులు చేపట్టారు. చెరువులకు పుష్కలంగా నీటిని అందించడంతో ఇప్పటికి చెరువులు కృష్ణా జలాలతో కళకళలాడాన్నాయి. చెరువులకు నీళ్లు, రాకపోకలకు వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి కృషి చేశారు. ప్రస్తుతం వంతెనలు లేకుండా పనులు చేపట్టడంతో తమకు ఇబ్బందులు కలుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు మండలాలకు అవస్థ

పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, ములకలచెరువు, కురబలకోట మండలాల పరిధిలో కాలువ సాగే గ్రామాలకు ఒకవైపున ఉన్న ప్రజలు కాలువ దాటి వెళ్లాలంటే వంతెనలు నిర్మించాలి. ఇలా చేస్తేనే ఇబ్బందులు తీరుతాయి. రాకపోకలకు, రవాణాకు ఇబ్బందులుండవు. ఇదే కాలువకు తూములు ఏర్పాటు చేసి చెరువులకు నీరందించాల్సి వుంది. నాలుగు మండలాల్లో 31 చోట్ల తూములు ఏర్పాటు చేయాల్సి వుంది. ఈ తూములను ఇప్పటికే గుర్తించి పనులు కూడా జరిగాయి. అయితే లైనింగ్ సమయంలో వీటిని పూర్తి స్థాయిలో పునరుద్ధరించి పనులు చేస్తే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జలాలను తరలించుకోవచ్చు. ప్రాజెక్టు ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టి లైనింగ్ పనులతో పాటు వీటి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు అందాల్సిన చెరువులు

పీబీసీ నుంచి తూముల ద్వారా పెద్దతిప్పసముద్రం మండలంలో దేవప్పచెరువు, దొరిగుండ్లవారిపల్లె చెక్ డ్యామ్, మద్దయ్యగారిపల్లె చెక్‌డ్యామ్, కొత్తపల్లె చెక్‌డ్యామ్, ఓటుకుంట, రేకులకుంట, సాలేవాండ్లపల్లెకుంట, బి.కొత్తకోట మండలంలో బాపనకుంట, పోమ్మచ్చినకుంట, రంగసముద్రం చెరువు, కానుగలకుంట, పెద్దచెరువు, పెద్దినాయునికుంట, బట్నాయునిచెరువు, బయ్యమ్మకుంట, తిమ్మసాని చెరువు, కాశప్పకుంట, నకోళ్ల చెరువు, మాలకుంట, ఎర్రమ్మచెరువు, మన్నేచెరువు, పెద్దపల్లిచెరువు, కురబలకోట మండలంలో శీతివారిపల్లె చెరువు, అప్పాలమ్మ చెరువు, బుర్రాచెరువు, రంగప్పచెరువు, పీనిగలచెరువు, గోపాలచెరువు, నల్లబయ్యమ్మచెరువు, రామక్క చెరువు, రంగమ్మచెరువులకు నీళ్లు తరలించాల్సి ఉంది. పైప్‌లైన్లు, తూములున్నాయి.


బి.కొత్తకోట మండలం గండువారిపల్లె గ్రామస్తులకు కాలువలో మట్టి దిబ్బే.. రాకపోకల దారి


కళకళలాడుతున్న సింగిరమ్మకుంట చెరువు

బ్రిడ్జిలు నిర్మించాల్సిన ఊర్లు

కి.మీ	ఊరిపేరు
76.600	గుడ్డంపల్లి
78.400	సిపీపల్లి
81.050	దొరిగుండ్లవారిపల్లి
83.250	మద్యగారిపల్లి
90.900	జనుపవారిపల్లి
91.875	జనుపవారిపల్లి
94.500	దిన్నిమీదపల్లి
101.000	బి.కొత్తకోట
108.050	వడిగలవాండ్లపల్లి
108.700	గండువారిపల్లి
112.600	ఎద్దులపల్లి
114.800	గుంతావారిపల్లి
120.000	దండువారిపల్లి
130.000	మద్దిరెడ్డిగారిపల్లి
132.650	కురబలకోట బీసీకాలనీ
133.100	బోయపల్లి ఆలయం
135.250	గుంతపల్లి
136.000	మిట్టపల్లి

సమీక్షించి చర్యలు తీసుకుంటాం

ప్రాజెక్టు ఈఈలతో సమావేశం నిర్వహించి పీబీసీ ద్వారా చెరువులకు నీటిని అందించే తూములు, రాకపోకలకు వీలుగా బ్రిడ్జిల నిర్మాణంపై సమీక్షిస్తాం. ఎక్కడెక్కడ ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై సత్వరమే చర్యలు తీసుకుంటాం.

–విఠల్ ప్రసాద్, ప్రాజెక్టు ఎస్ఈ, మదనపల్లె

విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన తరుణ్, విశ్వతేజ

మదనపల్లె సిటీ: రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి లాక్రోస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారని ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న తరుణ్, 8వ తరగతి చదువుతున్న విశ్వతేజ ప్రతిభ చాటి తృతీయ స్థానం దక్కించుకున్నారన్నారు. ఉపాధ్యాయులు, పీడీలు నరేష్‌బాబు, నాగరాజు తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఆకలి తీరుస్తున్న ఫుడ్ బ్యాంకు


ఫుడ్ బ్యాంకు వద్ద హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: అన్నార్తుల ఆకలిని ఫుడ్ బ్యాంకు తీరుస్తున్నట్లు హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ తెలిపారు. ఫుడ్ బ్యాంకు ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండులోని నిరాశ్రయులకు శుక్రవారం అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా దాతల సహకారంతో ఫుడ్ బ్యాంకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కిరణ్, చైతు, పవన్, సాయిదీపక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


నివాళులర్పిస్తున్న చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణ పరిధిలోని గాంధీపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ నేత శివారిపల్లి సుధాకర బంధువు నరసింహులు(67) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి ధైర్యం చెప్పారు. మండల పార్టీ కన్వీనర్ నీళ్ల భాస్కర్, ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

అక్క దేవతలకు పూజలు


విశేషాలంకరణలో అక్కదేవతలు

కేవీపల్లె: మండలంలోని కొత్తపల్లెలో అక్క దేవతలకు శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా ఏటా కొత్తపల్లెలో అక్క దేవతల పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం సాయంత్రం పిల్లనగ్రోవి, డప్పు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ప్రతిమలను ఊరేగించారు. ఆలయంలో అక్క దేవతలకు అభిషేకం నిర్వహించి, పుష్పాలతో అలంకరించారు. ఆలయం వద్ద భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, కుమారి, రామచంద్ర పాల్గొన్నారు.

అదుపుతప్పి తీవ్ర గాయాలు

బి.కొత్తకోట: గుమ్మసముద్రం పంచాయతీ కొత్తపల్లికి చెందిన రామచంద్ర (60) స్థానిక బత్తలాపురం రోడ్డు నుంచి బైక్‌పై కొత్తపల్లికి వెళ్తున్నాడు. ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించి వైద్యం అందిస్తున్నారు. వివాహ వేడుక నుంచి ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

అసంపూర్తి భవన నిర్మాణానికి సహకారం


నూతనంగా రూపు దిద్దుకున్న తరగతి గది

పెద్దతిప్పసముద్రం: గత ఎనిమిదేళ్ల నుంచి అసంపూర్తిగా ఉన్న ఓ తరగతి గది భవనాన్ని ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో ఎట్టకేలకు పూర్తిచేశారు. మండలంలోని టి.సదుం పంచాయతీ రామాపురంలో ఎనిమిదేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలకు ఓ తరగతి మంజూరైంది. కారణాలు ఏమైనా అప్పట్లో గోడల వరకు నిర్మాణాలు చేపట్టి వదిలేశారు. అప్పటి నుంచి పక్కనే ఉన్న రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. మొండి గోడలకే పరిమితమైన తరగతి గదిని పూర్తి చేయాలని గ్రామస్థులు, టీచర్లు సంకల్పించారు. గ్రామస్థుల సహాయ, సహకారాలు,హెచ్ఎం చొరవతో తరగతి గది సుందరంగా తీర్చిదిద్ది శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామస్థుల దాతృత్వాన్ని కొనియాడుతూ వారిని ఘనంగా సన్మానించారు.

భక్తి శ్రద్ధలతో షబ్ ఎ బరాత్ ప్రార్థనలు


జామియా మసీదులో ముస్లిం సోదరులు

మదనపల్లె సిటీ: ముస్లింలు పరమ పవిత్రంగా భావించి జరుపుకొనే పండుగ షబ్ ఎ బరాత్‌ను పురస్కరించుకుని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మతగురువులు ధార్మికోప్యాసం చేస్తూ షబేబరాత్ పండగ విశిష్టత తెలియజేశారు. వారు మాట్లాడుతూ అందరూ సన్మార్గంలో నడవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం దేశం కోసం, విశ్వ మానవాళి సంక్షేమం కోసం మతగురువులు ప్రత్యేక దువా చేశారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఖబర్‌స్థాన్‌కు వెళ్లి వారి పూర్వీకుల కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. స్థానిక బెంగుళూరు బస్టాండు వద్దనున్న జామియా మసీదులో మత పెద్దలు ధార్మికోపన్యాసం ఇచ్చారు. అనంతరం పూర్వీకుల ఆత్మశాంతి కోసం ఖబ్రస్థాన్‌కు వెళ్లి ప్రార్థనలు చేశారు. పట్టణంలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకకుండా టీకా వేయించాలి


కోళ్ల ఫారాలు తనిఖీ చేస్తున్న డాక్టర్ సురేష్

నిమ్మనపల్లె: మండలంలోని కోళ్ల ఫారాలను పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలో ఫారం కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో రాష్ట్ర పశుసంవర్థక శాఖ డైరెక్టర్ ఆదేశాలతో మండలంలోని 29 కోళ్ల ఫారాలను నాలుగు రోజులుగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. మండలంలోని కోళ్ల ఫారాల్లో ప్రస్తుతం 3.45 లక్షల కోళ్లను రైతులు పెంచుతున్నట్లు తెలిపారు. కోళ్లకు వైరస్ సోకకుండా టీకా వేయించాలన్నారు. ప్రజలు బర్డ్ ఫ్లూ వైరస్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాగా ఉడికించిన కోడి మాంసాన్ని, గుడ్లను తీసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్, మునేంద్ర, శాంతి తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య ప్రస్థానం స్ఫూర్తిదాయకం


నివాళులర్పిస్తున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె: సంపద, సంతతి లేకుండా జీవించిన అతి కొద్దిమంది రాజకీయవేత్తల్లో ఒకరైన దామోదరం సంజీవయ్య నేటి పాలకులకు స్ఫూర్తి దాయకమని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివ ప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక బాస్ కార్యాలయంలో, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రెండో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ భూ సంస్కరణలు అమలుచేసి, ఆరు లక్షల ఎకరాల బంజరు భూములను భూమిలేని వ్యవసాయ కూలీలకు పంచిపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల మోహన్, చాట్ల బయన్న, బురుజు రెడ్డిప్రసాద్, రవిశంకర్, తలారికృష్ణ, వై.గంగాధర్, రాయల్ సూరి, బి.నర్సింహులు, బైనేని సురేష్, రవి ప్రకాష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు యోచనను విరమించుకోవాలి

రాయచోటి అర్బన్ : ఆప్కాస్ రద్దుచేయాలన్న యోచనను రాష్ట్రప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దుచేసే అంశంపై నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. రాష్ట్రప్రభుత్వం జీఓ నం. 2 ద్వారా ప్రభుత్వశాఖలలో పనిచేసే ఉద్యోగులకు మాత్రమే ఎంటీఎస్ వర్తింపచేస్తూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఇప్పటివరకు పనిచేస్తున్న ఉద్యోగులందరికీ తీవ్రఅన్యాయం చేస్తోందంటూ విమర్శించారు. ప్రతినెలా ఒకశాతం కమీషన్‌తో వేతనాలు, సర్వీసును అందించే ఆప్కాస్‌ను రద్దుచేసి 4 శాతం కమీషన్ తీసుకునే రాబంధులు లాంటి కాంట్రాక్టర్‌ల చేతికి 1 లక్ష 20 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తును అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడుతుండడం దారుణమన్నారు. మెరుగైన పాలనను అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భద్రతలేని ఉద్యోగాల కల్పన పట్ల మొగ్గుచూపడం సరైన పద్ధతి కాదన్నారు. మాధవయ్య, రెడ్డెయ్య, రామచంద్రలు పాల్గొన్నారు.

కళాశాలలో సిమెంటు బల్లల ఏర్పాటు


మద్దిరెడ్డిని అభినందిస్తున్న వైద్యులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని వైద్యుడు విక్రాంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, పాత కాలేజీ మైదానం , ఉన్నత పాఠశాలల్లో రూ.1.25 లక్షలతో విద్యార్థులు, రోగులు కూర్చోవడానికి మద్దిరెడ్డి ఏర్పాటు చేసిన సిమెంటు బల్లులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మల్లయ్య కొండ కింద కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతు చేయించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనను డాక్టర్‌తోపాటు, అధ్యాపకులు అభినందించారు. వెంకటరాముడు, రెడ్డినాడు రామమోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సభలను విజయవంతం చేయండి

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని అజయ్ ఫంక్షన్ హాల్లో నేడు (శనివారం) నిర్వహించే జాతీయ బీసీ సంక్షేమ సభలను విజయవంతం చేయాలని బీసీ సంఘ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పద్మ యాదవ్ కోరారు. శుక్రవారం రాయచోటిలోని బీసీ సంఘాలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని దీనిని విజయంవం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గస్థాయి నుంచే కాకుండా అన్ని మండలాల నుంచి భారీగా తరలి రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రెడ్డెయ్య యాదవ్, నాగేశ్వర, మల్లికార్జున, పి. వెంకటరమణ, జయరాం, ఎస్.రవి, రజక సంఘం నాయకులు రమణ, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై యాసిడ్ దాడి అమానుషం

తంబళ్లపల్లె: గుర్రంకొండ మండలంలో ఓ బాలికపై ప్రేమ పేరుతో ప్రేమోన్మాది యాసిడ్‌తో దాడి చేయడం అమానుషమని నియోజకవర్గ బాలల హక్కుల ఐక్యవేదిక అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. సమాజంలో బాలికలు, మహిళలపైన దాడులు, అకృత్యాలు జరుగుతున్నా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

దేశ చరిత్రలో బ్లాక్ డే.. పుల్వామా దాడి


కురబలకోట: మాట్లాడుతున్న కల్పన


పీలేరులో మౌనం పాటిస్తున్న విద్యార్థులు


తంబళ్లపల్లె: వీర సైనికులకు వందనం చేస్తున్న విద్యార్థులు, తదితరులు


కలికిరి: కొవ్వొత్తులతో ర్యాలీ

కురబలకోట: దేశ చరిత్రలోనే పుల్వామా దాడి బ్లాక్ డేగా మారిందని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల పీజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కల్పన అన్నారు. బ్లాక్ డే సందర్భంగా శుక్రవారం అంగళ్లలోని కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్ లక్ష్యంగా ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు అమరులయ్యారన్నారు. వీరి త్యాగం మరుపురానిదన్నారు. ఈ సందర్భంగా అమర సైనికుల ఆత్మ శాంతి కోసం నివాళులర్పించారు. మౌనం పాటించి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు

తంబళ్లపల్లె: పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో అమర సైనికుల చిత్ర పటాలకు వందనం చేస్తూ నివాళులర్పించారు. దేశరక్షణ కోసం ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి 2019 ఫిబ్రవరి, 14న సుమారు 40 మంది జవాన్లు ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందారన్నారు. వారి ఆత్మలకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పీలేరురూరల్: పుల్వామా అమర వీరులకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు మాజీ సైనికులు, ఎన్‌సీసీ క్యాడెట్లు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. అమర వీరులు అమర్ రహే అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ దాడిలో 44 మంది జవాన్లు దేశ రక్షణకు ప్రాణాలర్పించారని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, శివ, మధు, సురేష్, రెడ్డెప్ప, హరీష్ నాగభూషణం పాల్గొన్నారు.

కలికిరి: ఉగ్ర దాడిలో ఆరేళ్ల క్రితం అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్‌లకు ఎంపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస కళాశాలలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీఎస్ రాయలసీమ అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా విధులలో ఉన్న సీఆర్‌పీఎఫ్ జవాన్ల బస్సుపై పాక్ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారని, 40 మందిని పొట్టన పెట్టుకున్నారని అన్నారు. అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఖదీర్ బాషా పాల్గొన్నారు.

రాత్రంతా.. రైతన్నల జాగరణ

కాలిపోయిన గుట్టలు, మామిడితోపులు


తూముకుంటలోని గుట్టల్లో చెలరేగిన మంటలు

గుర్రంకొండ: గుర్రంకొండ పంచాయతీ తూముకుంట, ముచ్చుకోన ప్రాంతాల రైతులు రాత్రంతా జాగారం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆయా ప్రాంతాల్లోని గుట్టలకు నిప్పు అంటించారు. దీంతో ఆయా పరిసర పొలాలకు చెందిన రైతులు మంటలు పొలాల వైపు రానీయకుండా రాత్రిళ్లు పొలాల వద్దే జాగారం చేశారు. గుర్రంకొండ పరిసరాల్లోని కొండలు, గుట్టలకు కొంతమంది దుండగులు కావాలనే నిప్పు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో గత గురువారం రాత్రి ఉన్నట్టుండి గుట్టల్లో మంటలు చెలరేగాయి. కాలుతున్న గుట్టల కింది భాగంలో పెద్ద ఎత్తున మామిడితోటలు, ఇతరత్రా ఉద్యానవన తోటలతోపాటు పలురకాల పంటలు సాగు అవుతున్నాయి. విషయం తెలుసుకొన్న పరిసర పొలాల రైతులు హుటాహుటిన అక్కడికి చేరుకొన్నారు. పచ్చి వేపకొమ్మలు, దుమ్ముధూళితో గుట్టల దిగువైపు వస్తున్న మంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేశారు. ఆయా ప్రాంతాల్లో చుక్కనీరు లేక పోవడంతో పట్టణం నుంచి వాటర్ ప్యాకెట్ల బస్తాలను తీసుకెళ్లారు. ఇలా రాత్రిళ్లు రైతులు నానా కష్టాలు పడ్డారు.

వంద ఎకరాల్లో నష్టం

తూముగుంట ప్రాంతంలో గత రాత్రి నుంచి చెలరేగిన మంటల్లో వంద ఎకరాల్లో మామిడితోటలు, పలుచోట్ల కొండలు, గుట్టలు దగ్ధమయ్యాయి. పలుచోట్ల పొలాల్లో అమర్చిన పైపులైన్లు, టమాటా తోటల్లో వినియోగించే సీడ్స్ కట్టెలు కాలిబూడిదయ్యాయి. ఒక్కసారిగా మంటలు దావానాలంలా వ్యాపించి కొండలు, గుట్టలతో సమీప తోటల వైపు దుసుకొచ్చాయి. ఒక్కసారిగా మంటలు తోటల్లో వ్యాపించాయి. గంటల తరబడి 100 ఎకరాల్లో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. ఈ మంటల్లో మామిడ్లితోటలు, ఆల్లనేరేడు, జామ,ముంతమామిడిచెట్లు కాలిబూడిదయ్యాయి. మంచి పూతమీదున్న మామిడి చెట్లు కాలిపోవడంతో రైతులు నష్టపోయారు. ఉద్యానవన తోటల్లో రైతులు అమర్చిన పైపులైన్లు దగ్ధమయ్యాయి. టామాటా పంట సాగు చేసుకొనేందుకు రైతులు పొలాల వద్ద ఉంచి సీడ్స్ కట్టెలు కాలిబూడిదయ్యాయి. దీంతో రైతులు లక్షలాది రుపాయలు నష్టపోయారు